
# కొంపెల్ల విశ్వం

# మంట




ప్రస్తుతం సుబ్బయ్య నాయుడికి వున్నదల్లా ఒకే ఒక్క ఆలోచన – 'ఆ కట్టడం ఎంత త్వరగా కట్టాలి. అలా కట్టడం వల్ల తనకు ఎంత 'మిగుల్తుంది?'

ఆ నగరంలో అద్భుతమైన జాగా పట్టాడతను. ఎక్కడెక్కడో వున్న జాగాలను పట్టడం, అక్కడ పెద్ద పెద్ద బిల్డింగులు కట్టడం, అందుకు సంబంధించి చిన్నా పెద్ద మనుషులందర్నీ పట్టడం – పట్టు పురుగులు, మల్బరీ ఆకుల జోలికి వెళ్లకపోయినా టోటల్‌గా సుబ్బయ్యది 'పట్టు' పరిశ్రమ. అదే – మనుషుల్ని పట్టుకునే పరిశ్రమ.

ఒకడు వందకు అమ్ముడుపోతాడు. ఇంకొకడు వెయ్యికి. కాస్త పెద్దవాడు లక్షకి. ఇంకా పెద్దవాడు కోటికి. అసలు అమ్ముడుపోని మనిషే వుండడు – అనేది సుబ్బయ్య నాయుడు పాలసీ.

ఒకడు వీధిలో పులి, ఇంట్లో పిల్లి. జానపద కథల్లో మాంత్రికుడి ప్రాణాలు సప్త సముద్రాల కవతల వున్న రామచిలకలో వున్నట్టు – వాడి ప్రాణాలు పెళ్లాం కళ్లల్లో వుంటాయి. పెళ్లాం కళ్లెర్ర జేసిందా – ఇక అంతే సంగతులు. వాడి సంగతి అలాంటిదని ముందుగా సుబ్బయ్య నాయుడికే తెలుస్తుంది. వెంటనే వాడి పెళ్లాన్ని మంచి చేసుకుంటాడు. మంచి చేసుకోవడమంటే మరోలాగ, యింకోలాగ కాదు – పట్టు చీరలు, బంగారు నగలు, వజ్రాలు ఇచ్చి.

మొగుడి ప్రాణాలే ఆవిడ కళ్లల్లో వున్నపుడు నాయుడికి కావల్సిన ఫైలుండదా!? ఉంటుందని చాలాసార్లు రుజువైంది.

మరొకడుంటాడు – డబ్బు చేత్తో ముట్టడు. పెళ్లాన్ని కూడా ముట్టుకోనివ్వడు. ఫ్లాట్స్ రూపంలోనో, డిపాజిట్స్ రూపంలోనో తనకు కావాల్సిన వాళ్ల పేరున కావాలంటాడు. వాడికి కావల్సిందిచ్చి తనకు కావల్సింది దక్కించుకుంటాడు సుబ్బయ్య నాయుడు.

ఇంకొకడుంటాడు – డబ్బు ముట్టడు. మందు ముట్టడు. నాన్ వెజిటేరియన్ తినడు. మనుషుల బ్రెయిన్ మాత్రం తింటూ వుంటాడు అసహనంతో. ఆ అసహనానికి కారణం పెళ్లాం పుట్టింటికి వెళ్లిందనో, వీడి వెధవ మొహం పొద్దస్తమానూ చూడలేక పెర్మనెంట్‌గా వెళ్లిపోయిందనో, యింకా వాడికి పెళ్లే కాలేదనో – ఆ కారణం ఏదయితే వుందో అది వెంటనే సుబ్బయ్యకు తెలిసిపోతుంది.

అతని 'అవరణ్'లో వున్న సీతాకోకచిలుక కోక విప్పేసి మిస్టర్ అసహనాన్ని సహనవంతుడుగా మార్చేస్తుంది. సుబ్బయ్య పని జరిగిపోతుంది.

ఏదేనా విషయాన్ని పసిగట్టడంలో సుబ్బయ్య నాయుడు తర్వాతే పోలీసులు కుక్కలు. అసలు సుబ్బయ్య ప్రతిభ లోపాయికారీగా వుండి పోయింది కానీ లేకపోతే పోలీసు కుక్కలకు శిక్షణ యిచ్చే చీఫ్‌గా నియమించి ప్రభుత్వం అతని ఋణం తీర్చుకునేది.

ఆ ఆలోచన ప్రభుత్వానికి రాకపోవడం ప్రభుత్వం దురదృష్టం. సుబ్బయ్య అదృష్టం. ఆమాటకొస్తే సుబ్బయ్య ఎప్పుడూ అదృష్టవంతుడే.


ఇప్పుడు నాయుడు చేజిక్కించుకున్న స్థలం అలాంటిలాంటి స్థలం కాదు. ఊరికి కొంచెం దూరమైనా పక్కనే మెడికల్ కాలేజీ వుండటంతో ఆ కాలేజీ ప్రొఫెసర్లు, కుర్రాళ్ల తలిదండ్రులు, రేపు ఉత్తరోత్తరా ఆ మెడికల్ కాలేజీలో డొనేషన్ కట్టి చేరి తీరాలని తీర్మానించుకున్న వారు సుబ్బయ్య నాయుడు కడుతున్న అధునాతన అతిపెద్ద అంతస్తులున్న ఫ్లాట్స్ సముదాయంలో కనీసం తమకు ఒక్క ఫ్లాటేనా కావాలని అతని వెంటపడ్డారు. నిజానికి సుబ్బయ్య అలా ప్లాన్‌చేసి వెంటపడేలా చేసుకున్నాడు. అంతకు ముందు ఫ్లాట్స్ అన్నిటికీ ఫ్లాట్ రేట్ పెట్టిన సుబ్బయ్య ఇప్పుడు ఫ్యాన్సీ రేటు పెట్టాడు.

అంతా బాగానే వుంది కానీ ఫ్లాట్ కాంప్లెక్స్ కడుతున్న లేబర్‌తోనే తలనొప్పి వచ్చి పడింది సుబ్బయ్యకి. వాళ్లు సత్తు టిఫెన్లతో అన్నమో సంకటో తెచ్చుకునేవారు తింటానికి. అదికాదతని సమస్య. రెండుసార్లు తలనొప్పిగా వుందని 'చా' తాగాలనేవారు. అక్కడెక్కడా 'చా' దొరకదు – మెడికల్ కాలేజి కేంటీన్‌లో తప్ప. వీళ్లు అక్కడికి వెళ్లలేరు. అంచేత వీళ్ల 'చా' తాగని తలనొప్పి సుబ్బయ్యకు అతిపెద్ద తలనొప్పిగా తయారైంది.

ఏ సమస్య అయినా ముందు జటిలంగానే కనబడుతుంది. ఆలోచిస్తే మార్గం దొరక్కపోదు. ఆ మార్గమే హనుమంతు. ఈ హనుమంతు రాముడికి కాదు – సుబ్బయ్య నాయుడికి నమ్మిన బంటు. ప్రస్తుతం నిర్మాణమవుతున్న ఫ్లాట్స్ సముదాయానికి వాచ్‌మన్, కేర్‌టేకర్ ఎక్స్ట్రా ఎక్స్ట్రా. వీడిచేత టీ బడ్డీ పెట్టిస్తే ఎలా వుంటుంది – ఆలోచన రావడమే ఆచరణలో పెట్టాడు సుబ్బయ్య. అన్నాళ్లు నమ్మకంగా పనిచేసినందుకు మేలు చేయబోతున్నట్టు చెప్పి ఓ చిన్న సైజు బడ్డీ కొట్టు పెట్టడానికి అవసరమైన సరంజామాతో బాటు ఆర్థిక సహాయం కూడా అందజేశాడు. అలా అందజేస్తున్నపుడు దస్తావేజుమీద హనుమంతు వేలిముద్ర తీసుకోవడం మర్చిపోలేదు సుబ్బయ్య.

సుబ్బయ్య తల్చుకుంటే టీకేమీ కొదవలేదని తొందర్లోనే రుజువైంది.

ఫ్లాట్స్ సముదాయానికి ఓ మూల టీకొట్టు మొదలైపోయింది. కూలీల తలనొప్పి పోగొట్టే టీ మాత్రమే కాకుండా బన్ను, బిస్కట్లు, అరటిపళ్లు, బ్రూ – ఇవి కూడా హనుమంతు చేత పెట్టించాడు సుబ్బయ్య. సిగరెట్లు, బీడీలు సరేసరి! అవెందుకు



- అనే ప్రశ్న హనుమంతు అడగలేదు. 'ఎందుకు' అని ప్రశ్నించడం చేతకాని మనుషులకు ప్రతినిధి అతను.

టీయే కాదు, మిగతావి కూడా అమ్ముడుపోవడం మొదలెట్టాయి. సుబ్బయ్య సలహాతో ఇడ్లీలు, పెసరట్లు చేశాడు హనుమంతు. వాటికీ అలవాటు పడ్డారు జనం. ఆ అలవాటు ఎంతగా అయిందంటే కొంతమంది యింటి దగ్గర్నుంచి అన్నం, సంకటి తెచ్చుకోవడం మానేసి వాటిమీద ఆధారపడుతున్నారు. వాళ్లేకాదు – మెడికల్ కాలేజి స్టాఫ్, స్టూడెంట్స్ హనుమంతు చేసే ఇడ్లీలు, పెసరట్లు రుచి మరిగారు.

కూలిజనం ఎప్పుడు పడితే అప్పుడు మెడికల్ కాలేజిలోకి వెళ్లి 'చా' తాగలేరు. కాలేజి జనం ఎప్పుడు బడితే అప్పుడు బైటకొచ్చి హనుమంతు కొట్లో తినగలుగుతున్నారు.

ఆ కట్టడం చకచకా ఎలా పైకి లేస్తోందో అంతే చకచకా హనుమంతు టీకొట్టు ప్రాశస్త్యం పెరగసాగింది.

కట్టడం పూర్తయింది. కూలిజనం వెళ్లిపోయారు. ఫ్లాట్స్ కొనుక్కున్న వాళ్లు, కొనుక్కున్న వాళ్ల దగ్గిర అద్దెకు తీసుకున్న వాళ్లు ఒక్కొక్కరే దిగుతున్నారు. కూలిజనం వెళ్లినా ఫ్లాట్స్ జనం రావడం, ఆల్రడీ మెడికల్ కాలేజి స్టాఫ్, కుర్రాళ్లు హనుమంతు ఇడ్లీ, పెసరట్ రుచి మరగడంతో అమ్మకాలు పెరిగాయి కూడా! పెరుగుట తరుగుట కొరకే కదా! అమ్మకాలు పెరగడం హనుమంతు తరుగుటకు దారితీసింది.

హనుమంతు కొట్లో వస్తున్న డబ్బు ముడిసరకు, యితర పదార్థాలు కొనడానికి మినహాయించి మిగతాదంతా ఎప్పటికప్పుడు సుబ్బయ్యకు జమకడుతున్నాడు. మొదట్లో సుబ్బయ్య హనుమంతుకిచ్చిన అసలు, వడ్డీ, ఆ వడ్డీకి వడ్డీ ఎప్పుడో తీరిపోయాయి. అయినా హనుమంతు యిస్తూనే వున్నాడు. సుబ్బయ్య తీసుకుంటూనే వున్నాడు. పదిమందితో మెలగడం వల్ల రకరకాల మనుషులొచ్చి చెప్పుకునే కబుర్ల వల్ల హనుమంతు లోకజ్ఞానం పెరగసాగింది. ఆ పెరిగిన లోకజ్ఞానంతో సుబ్బయ్యను ప్రశ్నలు అడగసాగాడు. కొన్ని ఖచ్చితంగా సుబ్బయ్యను ఇబ్బంది పెట్టే ప్రశ్నలే. అదే విషయం సుబ్బయ్యకు 'మూడ్' వచ్చినపుడు భార్య కూడా నొక్కి వక్కాణించింది – 'ఆ హనుమంతు లోగడలాగ లేదు. ప్రపంచ జ్ఞానం పెరిగిపోతోంది.'

'ఏ ప్రభుత్వమైన నిరక్షరాస్యత రూపుమాపే పేరుతో చదవడం, రాయడం నేర్వాలనుకుంటుంది. విజ్ఞానం నేర్వాలని అనుకోదు. ప్రభుత్వం ప్రజలది కాబట్టి, ప్రజలంటే సుబ్బయ్య, అతని భార్య లాంటి వారే కాబట్టి హనుమంతు విషయం వారికి నచ్చలేదు. ఫలితంగా – సుబ్బయ్యకు కొడుకు వరస అయిన వాడ్ని ఒకడ్ని, భార్యకు తమ్ముడు వరస అయిన వాడ్ని ఒకడ్ని రప్పించి కేంటీన్ నడిపే పని అప్పగించారు. హనుమంతుకు ఇంట్లో మొక్కలకు నీళ్లుపోయడం, బూజులు దులపడం, రాత్రి సుబ్బయ్య నిద్రపోయే వరకూ కాళ్లు పట్టడం – యిలాంటి పనులు అప్పగించారు.

హనుమంతుకు కొంత అర్థమైంది. కొంత అర్థం కాలేదు. తను చేసిన తప్పేమిటి? ఓ రోజు దొర యింట్లో లేనపుడు దొరసాని కాళ్లు పట్టమంటే పడుతూ అడిగాడు. విస్మయంగా చూసి ఆమె "అదేం లేదురా. కేంటీన్ కొచ్చే జనాలు పెరిగారు కదా! పాపం నీ ఒక్కడి వల్లా కష్టం కదా అందుకు" అంది. అందుకు కాదని మరెందుకో అని హనుమంతుకు అనిపించింది.

వారం రోజులు కేంటీన్ నడిచింది. ఆపైన జనం పలచబడ్డారు. పెసరట్టు హనుమంతు చేస్తున్నట్టు రాకపోవడమే ప్రధాన కారణం అని సుబ్బయ్య పసిగట్టాడు.

వెంటనే హనుమంతుకు కేంటీన్ డ్యూటీ పడింది. హనుమంతు చేతి రుచి మరిగిన జనం మళ్లీ రావడం మొదలుపెట్టారు. సంబరపడ్డాడు హను

With Best Compliments
from
PALANIAPPA
& Co
Main Road
VIJAYAWADA-1

మంతు. ఆ సంబరంలో టమోటా రైస్, లెమన్ రైస్ చేయడం మొదలెట్టాడు. వాటితో బాటు స్పెషల్ వడ కూడా! అవీ బావున్నాయని పేరొచ్చింది. అంతా బాగానే వుంది కానీ ఇది వరకు టీకొట్లో మొత్తం అంతా తనే! టిఫిన్లు చేయడం, సర్వ్ చేయడం, కేష్ డీలింగ్ అన్నీ తనే! ఇప్పుడు అన్నివిధాలా పెరిగిన కేంటీన్‌లో కేవలం టిఫిన్లు చేయడం, అప్పుడప్పుడు తానూ వున్నట్టు కనిపించడం తప్ప తనకు లోగడ వున్న గుర్తింపు లేదు. పైగా యింటి డ్యూటీ. ముఖ్యంగా సుబ్బయ్యకు కాళ్లు పట్టే డ్యూటీ తప్పడంలేదు. బాగా నలిగిపోతున్నాడు హనుమంతు. కాళ్లు పట్టించుకుంటూ హనుమంతు ద్వారా కేంటీన్ విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడు సుబ్బయ్య నాయుడు.

అక్కడున్న మనుషులకు – అదే తనవాళ్లకు హనుమంతు సంగతి నచ్చడంలేదని సుబ్బయ్యకు అర్థమైంది. తినడానికి వచ్చిన వారంతా పదార్థాలు బావున్నాయని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో హనుమంతును మెచ్చుకోవడం వారికి కంటకంగా వుందనే విషయం నాయుడికి అర్థమైంది.

* * *

నగరం నడిబొడ్లో వున్న రెండు హోటల్స్ నుంచి చెరొకర్ని తెచ్చి కేంటీన్‌లో పెట్టాడు సుబ్బయ్య. ఇద్దర్నీ ఒకే హోటల్ నుంచి తేవచ్చు. తేలేదు. తెస్తే ఇద్దరూ కుమ్మక్కయ్యే అవకాశం వుందని సుబ్బయ్యకు తెలుసు. ఇద్దరిలో ఒకడు అయ్యరు. సాంబారు బాగా పెడతాడు. ఇదివరకు కేంటీన్‌లో సాంబారు లేదు. ఓ కొత్త అయిటమ్ చేస్తేనే కదా – జనం హనుమంతు వంటకాలు మర్చిపోయేది! రెండోవాడు మాణిక్యం. దోసె మాస్టర్. ఈ రెండు కొత్త వాటితో జనం సంతోషించారు. హనుమంతు ప్రాపకం నెమ్మదిగా తగ్గింది. అయినా వాడిచేత ఇంట్లో కాళ్లు పట్టించుకోవడంతో బాటు కేంటీన్‌లో పిండి రుబ్బించడం, గిన్నెలు, గ్లాసులు తోమించడం చేయసాగాడు సుబ్బయ్య. క్రమేపీ – ఒక్కో మెట్టూ తాను దిగజారిపోతున్నాననే భావం మనసులో మెదిలి స్థిరపడసాగింది హనుమంతుకు.

ఒకనాడు రెక్కలు విప్పుకుంటున్న పక్షిలా అనిపించిన జీవితం ఇప్పుడు తెగిపోయినట్టు అనిపించసాగింది. తన ఉనికికే ప్రమాదం ఏర్పడిన అక్కడ యింక వుండకూడదు. వెళ్లిపోవాలి. అదే చెప్పాడు ఓరోజు కాళ్లు పడుతూ – సుబ్బయ్యతో అసలే మందుమీదున్నాడేమో ఒక్క తన్ను తన్నాడు సుబ్బయ్య. కాళ్ల దగ్గిరున్నవాడ్ని తన్నడం సులువు కదా!

"ఎల్లిపోతావా. నా బాకీ ముప్పయివేలు తీర్చేసి ఎల్లిపో"

"ముప్పయివేలేటి!?"

"ఏటా!? ముప్పయివేలు తీసుకున్నానని యిదుగో నువ్వేసిన 'ఏలుముద్దర" అంటూ బీరువాలోంచి ప్రోనోటు తీసి చూపించాడు.

"ఆ డబ్బు కేంటీన్ కోసం యిచ్చింది. ఆ డబ్బు కన్నా నేను చాలా ఎక్కువ డబ్బు జమ చేశాను – ఇది అన్యాయం" హనుమంతు.

"అన్నాయమే. పెపంచంలో వున్నదదే. తిరగబడతావా, ఏదీ తిరగబడు సూద్దాం" మరో తన్ను తన్నాడు సుబ్బయ్య.

తన్నినవాడు నిద్రపోతాడు కాబట్టి సుబ్బయ్య నాయుడు నిద్రపోయాడు. తన్నులుతిన్నవాడు నిద్రపోలేదు కాబట్టి హనుమంతు నిద్రపోలేదు.

వారం రోజులు గడిచిపోయాయి. ఆరోజు హనుమంతు, దొరసాని తప్ప యింట్లో ఎవరూ లేరు. సాయంత్రం హనుమంతు కేంటీన్‌కు వెడతానంటే స్నానం చేసి వచ్చేవరకూ ఆగమని స్నానానికి వెళ్లిందామె. పొరబాటున బీరువా తాళం చెవులు బీరువాకే వేళాడుతున్నాయి. ఇంక ఆలస్యం చేయలేదు హనుమంతు.

బీరువాలో తన ప్రోనోటు కోసం వెదికాడు. కనిపించింది. అది తీశాడు. దానికింద అలాటిదే మరొకటి. అదీ తీశాడు. దానికింద అలాంటిదే ఇంకొకటి... మరొకటి... ఇంకొకటి... అవీ తీశాడు. అందులో తనదేదో చదువురాని, చదవలేని హనుమంతుకు తెలీలేదు. అయితేనేం – అవి తనలాంటివాళ్లవే, ఎందరో – అనే విషయం బాగా తెలిసింది. మొత్తం అన్నీ తీసేశాడు.

నిక్కరు జేబుల్లోనూ, కడుపుకూ నిక్కరుకూ మధ్యలోనూ పేర్చి పైనున్న చొక్కా ఆసరాతో మామూలుగానే కనిపిస్తూ బీరువా మూసి వేరే గదిలోకెళ్లి చీపురు తీసుకుని వూడ్చే కార్యక్రమం చేపట్టాడు. దొరసాని స్నానం చేసి వచ్చాక ఆమెతో చెప్పి కేంటీన్ వైపు నడిచాడు.

కేంటీన్‌లో పొయ్యి మండుతోంది .–

కొన్నాళ్ల క్రితం ఢిల్లీలో ఓ పెద్దమనిషి భార్యను ముక్కలు ముక్కలుగా నరికించి కేంటీన్ పొయ్యిలో పారేయించిన సంగతి ఎవరో చెప్పుకోగా విన్నాడు హనుమంతు. ఆమె ఎలాంటిదైనా అది నిజంగా అమానుషమే. తను – అలా చేయడం లేదు. ఒక్కో ప్రోనోటు ముక్కలు చేసి పొయ్యిలో పారేసి కాలుస్తున్నాడు. ఇలా కాల్చడం వల్ల ఎన్నో జీవితాలను రక్షించడం, స్వేచ్ఛనివ్వడం. మొత్తం పని పూర్తిచేసి బైటకొచ్చి వొళ్లు విరుచుకున్నాడు హనుమంతు.

సూర్యుడు అస్తమిస్తున్నాడు. హనుమంతుకు అది అస్తమయంలా లేదు. సరికొత్త ఉదయంలా వుంది.

# కదన కుతూహలం

పరిసరాల్లో ప్రమేయం లేకుండా
ఒక రస ప్రపంచం చుట్టుముడుతోందా?
అది కళ కావాలి
ఉన్నపాటున శరీరం
ఇగిరి ఎగిరి పోతోందా?
అది సంగీతం కావాలి
మాల కడుతున్న కొత్త పెళ్ళికూతురి
ఎర్రగాజుల గలగలల్లా
రాగం పరిమళిస్తోందా?
అది శంకరశాస్త్రి గారి వీణ అయి ఉండాలి
పరుగుదూకుల తెల్ల కుందేళ్ళై
కొత్తగా పుట్టిన చెంగనాల ఆవుదూడవై
వాన వెలిగించిన
చెరువులోని చినుకు ప్రమిదలై
లేతాకు పచ్చటి రావి చివుళ్ళ నుంచి
మిలమిలా చెదురుతున్న ఎండ ముత్యాలై
మధ్య మధ్య ఫ్రీజ్ అవుతున్న
సెలయేటి తరగలై
స్వరాలు మైమరిపిస్తున్నాయా?
అప్పుడు
శరీర నిర్ముక్తమైన మనస్సు
కుందేళ్ళనీ, ఆవుదూడల్నీ
చినుకు ప్రమిదల్నీ, ఎండముత్యాల్నీ,
సెలయేటి తరగల్నీ
వెంటాడుతూ
థిల్లానా నృత్యం చేస్తోందా?
అది 'కదన కుతూహలం' అయితీరాలి

('ప్రమవ' కోసం)

డా. రెంటాల శ్రీ వేంకటేశ్వరరావు